ఇక బడుగు వ్యాపారుల పైనా జీఎస్టీ!

న్యూఢిల్లీ, మే 24: మధ్య స్థాయి నుంచి భారీ స్థాయిలో వ్యాపారం చేసే వారిని లక్ష్యంగా చేసుకుని ఎడాపెడా జీఎస్టీ భారాన్ని విధించిన కేంద్రం ఇప్పుడు బడుగు, బలహీన వర్గాలను కూడా పన్ను పరిధిలోకి తేవాలని తహ తహలాడుతున్నది. అనధికారిక ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించి వారిని కూడా జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) తన ఫీల్డ్ అధికారుల ద్వారా ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు కసరత్తులు ప్రారంభించింది. నమోదు కాని సంస్థల ద్వారా పన్ను ఎగవేతలను నిరోధించి నగదు ఆధారిత, లెక్కల్లో చూపని లావాదేవీలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ధ్యేయంగా నిర్ణయించుకుంది. ఇదే కనుక అమలైతే ఇక నుంచి బజ్జీల బండి వాళ్లు, బండ్లపై అరటి పండ్లు అమ్ముకునే వారితో పాటు రోడ్డు పక్కన ఉండే మెకానిక్‌లు, సైకిల్ షాపు వాళ్లు, టైర్లకు గాలి కొట్టేవారు.. ఇలా ఒకరేమిటి రోడ్డుపక్కన తోటకూర అమ్ముకునే తాత నుంచి, రేగు పండ్లు అమ్ముకునే మామ్మ వరకు అందరిపై జీఎస్టీని ఎడాపెడా విధించడానికి కేంద్రం చకచకా పావులు కదుపుతున్నది.

డీ-మెర్జింగ్‌తో వాటాదారులకు లాభమే

టాటా మోటార్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్

నూఢిల్లీ, మే 24: టాటా మోటార్స్‌ను విడగొట్టే ప్రతిపాదనతో దీర్ఘకాలికంగా వాటాదారులకు లాభం చేకూరనున్నదని కంపెనీ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. కంపెనీ 80వ వాటాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టాటా మోటార్స్‌ను రెండు సంస్థలుగా విడగొట్టి కమర్షియల్ వాహనాలు, ప్యాసింజర్ వాహన విభాగాలుగా విడగొట్టి స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే వాటాదారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఈ ఏడాది రెండో అర్థ భాగం నాటికి టాటా మోటార్స్ రెండు సంస్థలుగా మారబోతున్నది. వ్యాపార వ్యూహాత్మకంలో భాగంగా పలు సంస్థలను విడగొట్టాలని నిర్ణయించినట్టు, దీంతో గ్రూపు ఆర్థికంగా బలోపేతం కావడంతోపాటు వాటాదారులకు లబ్ధిచేకూరనున్నదని ఆయన వ్యాఖ్యానించారు.

గిన్నిస్‌బుక్‌లో ఎల్ఐసీ

24 గంటల్లో 5.88 లక్షల పాలసీల విక్రయంతో రికార్డు

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మరో అరుదైన ఘనతను సాధించింది. కేవలం 24 గంటల్లో రికార్డు స్థాయిలో బీమా పాలసీలను విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నది. ఈ ఏడాది జనవరి 20న ఈ అరుదైన ఘనతను సాధించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. విస్తృతమైన ఏజెన్సీ నెట్‌వర్క్ కలిగిన తమ పనితీరుకు గుర్తుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు గుర్తించిందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 20న కంపెనీకి చెందిన 4,52,839 ఏజెంట్లు ఒక్కో పాలసీ చొప్పున 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించారు. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలను విక్రయించడం ఇదే తొలిసారని తెలిపింది. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం రోజైన జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే'ను పురస్కరించుకొని ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్కో పాలసీ అయిన పూర్తి చేయాలన్న కంపెనీ ఎండీ, సీఈవో సిద్దార్థ మొహంతీ విజ్ఞప్తి మేరకు ఈ అరుదైన ఫీట్‌ను సాధించినట్లు వెల్లడించారు. ఈ అరుదైన మైలురాయిని సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు.

సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు

ఈవీను విడుదల చేసిన చైనా సంస్థ షియోమీ

న్యూఢిల్లీ, మే 24: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ షియోమీ మరో అడుగుముందుకేసింది. ఇప్పటికే తన తొలి మాడల్‌కు విశేష స్పందన లభిస్తున్న ప్రస్తుత తరుణంలో మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వైయూ7 పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో గరిష్ఠంగా 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. టెస్లాకు చెందిన వై మాడల్‌కు పోటీగా ఈ కారును ప్రవేశపెట్టింది. ఇప్పటికే విడుదల చేసిన ఎస్‌యూ7 సెడాన్ 2.58 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి.

ఈ నూతన కారు ప్రత్యేకతలు..

- సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అత్యధిక మైలేజీ ఇచ్చే మూడో మాడల్ ఇదే కావడం విశేషం.
- 96.3 కిలోవాట్ల ఎల్ఎఫ్‌పీ బ్యాటరీతో తీర్చిదిద్దింది. కేవలం 3.23 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 253 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- ప్రో మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 770 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

ఎఫ్‌డీఐలు తిరోగమనం

2024-25లో భారీగా తగ్గిన విదేశీ పెట్టుబడులు

న్యూఢిల్లీ, మే 24: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో నరేంద్ర మోదీ సర్కార్ విఫలమవుతున్నది. గడిచిన కొన్నేండ్లుగా తగ్గుముఖం పట్టిన ఎఫ్‌డీఐలు..గడిచిన ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా పడిపోయాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి కేవలం 353 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది వచ్చిన 10 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలతో పోలిస్తే 96.5 శాతం తగ్గాయని పేర్కొంది. అంతక్రితం ఏడాది రికార్డు స్థాయి ఎఫ్‌డీఐలను ఆకర్షించిన భారత్.. ఆ మరుసటి ఏడాదే భారీగా పడిపోవడం విశేషం. కానీ, విదేశాల్లో పెట్టుబడులు పెట్టే దేశీయ కంపెనీలు భారీగా పెరుగుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆయా సంస్థలు 29 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాయి. అంతక్రితం ఏడాది పెట్టిన 17 బిలియన్ డాలర్ల కంటే ఇది 50 శాతానికి పైగా అధికం.

విదేశీ పెట్టుబడిదారులు దూరం

ప్రపంచ దేశాల్లో భారత్ అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నప్పటికీ విదేశీ పెట్టుబడిదారులు పెద్దగా ఆసక్తిని కనబర్చడం లేదు. దీంతో గడిచిన కొన్నేండ్లుగా భారీగా పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు..గతేడాది పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేశారు. కానీ, దేశీయ ఈక్విటీ మార్కెట్లపై మాత్రం ఎనలేని ప్రేమను కురిపిస్తున్నారు. ఇతర దేశాల ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే సెన్సెక్స్, నిఫ్టీలు రెండంకెల స్థాయిలో రాబడిని పంచడమే ఇందుకు కారణం. మొత్తంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు 13.7 శాతం పెరిగి 81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటిలో సగం ఐపీవోకి వచ్చిన సంస్థల్లో ఇన్వెస్ట్ చేశారు. 2023-24 సంవత్సరంలో విదేశీ పెట్టుబడిదారులు 49 బిలియన్ డాలర్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ఆల్ఫా వేవ్ గ్లోబల్ అండ్ పార్టనర్స్ గ్రూపు, స్విగ్గీ, విశాల్ మెగా మార్ట్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐలు అత్యధికంగా వచ్చాయి. అలాగే ఆల్టార్ నెటివ్ క్యాపిటల్ అసోసియేషన్(ఐవీసీఏ), ఈవై, పీఈ/వీసీ ల నుంచి 26.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. హ్యుందాయ్ మోటర్ ఇండియా తన వాటాను 100 శాతం నుంచి 82.5 శాతానికి తగ్గించుకోవడంతో రూ.27,870 కోట్ల నిధులు సమకూరగా, అలాగే స్విగ్గీ కూడా 2 బిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. వీటితోపాటు టెలికం దిగ్గజం సింగ్‌టెల్..భారతీ ఎయిర్‌టెల్‌లో తనకున్న వాటాను మొత్తం విక్రయించగా, అలాగే బ్రిటిష్ అమెరికన్ టొబాకో(బీఏటీ)..ఐటీసీలో ఉన్న తన మొత్తం వాటాను విక్రయించింది. గతేడాది సెప్టెంబర్ నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో ఒక్కో విదేశీ కంపెనీలు..దేశీయ పెట్టుబడులను ఉపసంహరించుకున్నాయి.

తయారీ రంగానికి బ్రేక్‌లు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో తయారీ రంగంతోపాటు ఆర్థిక సేవలు, ఎనర్జీ, కమ్యూనికేషన్ రంగాలు విఫలమయ్యాయి. గత కొన్నేండ్లుగా ఈ రంగాలు ఆశాజనక పనితీరు కనబర్చలేకపోవడంతో విదేశీ పెట్టుబడిదారులు వీటివైపు కన్నెత్తి కూడా చూడలేదు. తయారీ, ఆర్థిక సేవలు, ఎనర్జీ, టెలికం రంగాల్లోకి ఎఫ్‌డీఐలు భారీగా తగ్గడం మొత్తం ఎఫ్‌డీఐలపై ప్రతికూల ప్రభావం చూపాయని సెంట్రల్ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడించింది.

హైదరాబాద్‌లో యంత్రాల ఎగ్జిబిషన్

హైదరాబాద్, మే 24: దక్షిణాదిలో అతిపెద్ద బీ2బీ ఇండస్ట్రియల్ యంత్రాలు అండ్ ఇంజినీరింగ్ ఎగ్జిబిషన్‌కు మరోసారి హైదరాబాద్ వేదికైంది. నాలుగోసారి జరుగుతున్న ఈ ఎగ్జిబిషన్‌లో ఇంజినీరింగ్, మౌలిక రంగానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మెషిన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

బ్రోక్‌ఫిల్డ్ భారీ పెట్టుబడులు

న్యూఢిల్లీ, మే 24: అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ బ్రోక్‌ఫిల్డ్..భారత్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. వచ్చే ఐదేండ్లకాలంలో తన ఆస్తులను 100 బిలియన్ డాలర్ల స్థాయిలో పెంచుకోవడానికి భారీగా ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నది. ప్రస్తుతం సంస్థ భారత్‌లో 30 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులు కలిగివున్నది. మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, రెన్యూవబుల్ ఎనర్జీ, ప్రైవేట్ ఈక్విటీల్లో తన అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ కలిగివున్నది.

ఎఫ్ఐఐల 5 వేల కోట్ల వెనక్కి

గతవారంలో తరలించుకుపోయిన విదేశీ ఇన్వెస్టర్లు

న్యూఢిల్లీ, మే 24: దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకుంటున్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత వారంలోనూ రూ.5 వేల కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో ఈ నెల 19 నుంచి 23 మధ్యకాలంలో ఈక్విటీల నుంచి రూ.4,784.32 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎఫ్ఐఐల పెట్టుబడులు రూ.18,620 కోట్ల నుంచి రూ.13,835 కోట్లకు తగ్గాయని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఐదు సెషన్లలో విదేశీ పెట్టుబడిదారులు అత్యధికంగా తమ పెట్టుబడులను తరలించుకుపోయారు. తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు గతవారంలో ఒకేరోజు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి ఎఫ్ఐఐలు రూ.98,516 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..యూరోపియన్ దేశాలపై ప్రతీకార సుంకాలను 50 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయంగా పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించారు. దేశీయ ఆర్థిక మూలలపై ఎలాంటి ప్రభావం లేదని, కేవలం అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల వల్లనే ఎఫ్ఐఐలు వెనక్కి తీసుకుంటున్నారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ నెలలో ఎఫ్ఐఐలు రూ.4,223 కోట్ల పెట్టుబడులు పెట్టగా, మార్చి నెలలో రూ.3,973 కోట్ల విలువైన స్టాక్స్‌ను కొనుగోలు చేశారు. కానీ, జనవరి నెలలో రూ.78 వేల కోట్లు, ఫిబ్రవరి నెలలో రూ.34,574 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

ఎన్‌టీపీసీ రూ.33.50 డివిడెండ్

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.7,897.14 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,490.05 కోట్ల లాభంతో పోలిస్తే భారీగా వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.48,816.55 కోట్ల నుంచి రూ.51,085 కోట్లకు ఎగబాకింది. దీంట్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా సంస్థకు రూ.49,352 కోట్ల ఆదాయం సమకూరింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,90,862.45 కోట్ల ఆదాయంపై రూ.23,953.15 కోట్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు, 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.33.50 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. గతేడాది కొత్తగా 3,972మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రావడంతో మొత్తం కెపాసిటీ 79,930 మెగావాట్లకు చేరుకున్నది.

సింగరేణిలో బదిలీలు ఇక కఠినతరం

- పెరిగిన రాజకీయ జోక్యంతో యాజమాన్యం నిర్ణయం
- తాజాగా కఠిన నిబంధనలతో సర్క్యులర్ జారీ.. వచ్చే నెల 1 నుంచే అమల్లోకి
- వ్యతిరేకిస్తున్న కార్మికులు, కార్మిక సంఘాలు

సింగరేణి కార్మికులు

పెద్దపల్లి, మే 24(నమస్తే తెలంగాణ): సింగరేణిలో బదిలీల ప్రక్రియ కఠినతరమైంది. కొద్దిరోజులుగా పెరిగిన రాజకీయ జోక్యంతో ఇబ్బందులు వస్తుండగా, వాటికి చెక్‌పెడుతూ పలు కఠిన నిబంధనలతో కూడిన సర్క్యులర్‌ను యాజమాన్యం ఇటీవలే విడుదల చేసింది. కార్మికుడికి సర్వీసులో రెండేసార్లు స్థానచలనానికి అవకాశం ఇవ్వడం, ప్రతి ఒక్కరూ మూడేళ్లపాటు భూగర్భ గనిలో పని చేయాలని, ఇలా పలు రూల్స్ విధిస్తూ మార్గదర్శకాలు జారీ చేయగా, కార్మికుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈ నిబంధనలతో బదిలీ న్యాయంగా అవసరమైన కార్మికులకు అన్యాయం జరుగుతుందనే వాదన వినిపిస్తున్నది. పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఒక ఓసీపీలో పనిచేసే కార్మికుడు ఇటీవల మరో గనికి బదిలీపై వెళ్లాడు. తీరా మూడు రోజుల తర్వాత సదరు కార్మికుడు ఓ నేత ద్వారా సిఫారసు లేఖ తెచ్చుకొని తనకు నచ్చిన మరో ఓసీపీకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఇలా చాలా మంది కార్మికులు రాజకీయ అండదండలు, డబ్బులతో ఉన్నతాధికారులను మచ్చిక చేసుకొని తమకు నచ్చిన చోట సులభంగా డ్యూటీ చేసుకునే విధంగా బదిలీల పర్వాన్ని కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ ప్రక్రియలో కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున డబ్బులను దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పదేళ్లుగా ఇలాంటి ఒత్తిడులు సింగరేణి యాజమాన్యం అంతగా చూడలేదు. ప్రభుత్వం మారిన తర్వాత మాత్రం పెద్ద ఎత్తున రాజకీయ జోక్యం పెరగడంతో అదే స్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా తండ్రి స్థానంలో ఉద్యోగంలో చేరుతున్న వారసులు శారీరక శ్రమ లేకుండా జాబ్ చేసేందుకే ఇష్టపడుతున్నారు. ఇందుకోసం ఉద్యోగాల్లో చేరక ముందే పైరవీల బాట పడుతున్నారు. అధికార దర్పంతో సిఫారసుల ద్వారా ఇష్టారీతిన వారికి నచ్చిన చోటుకు బదిలీలు చేయించుకోవడం యాజమాన్యానికి తలనొప్పిగా మారింది. ఈ క్రమంలో రాజకీయ ఒత్తిళ్లు, ఉన్నతాధికారుల ఆదేశాలు, యువ ఉద్యోగుల డిమాండ్ల నుంచి తప్పించుకునేందుకు కొత్త విధివిధానాలను రూపొందిస్తూ ఈనెల 12న సింగరేణి యాజమాన్యం సీఆర్పీ/పీఈఆర్/పీఎం/2229/1 పేరిట సర్క్యులర్ జారీ చేసింది.

మార్గదర్శకాలివే..?

సింగరేణి బొగ్గు గనుల్లో బదిలీల ప్రక్రియపై డైరెక్టర్(పా)కు, జీఎం ఆఫీస్ స్థాయిలో ఏరియా జీఎంకు నిర్ణయాధికారం ఉంటుంది. ఏటా ఏప్రిల్, అక్టోబర్‌లోనే బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. తాజాగా జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ప్రతి ఉద్యోగికి సర్వీస్‌లో రెండుసార్లే బదిలీ ఉంటుంది. ఇంకా ప్రతి కార్మికుడు మూడేళ్లపాటు భూగర్భ గనిలో పని చేయడం తప్పనిసరి. పదోన్నతులు పొందిన కార్మికుడిని సింగరేణి వ్యాప్తంగా ఎక్కడికైనా బదిలీ చేస్తారు. ఇక నుంచి అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్‌లో కూడా బదిలీలు ఉంటాయి. ఫిర్యాదు వచ్చిన ఉద్యోగిని కూడా బదిలీ చేసే అవకాశం ఉంది. సెన్సిటివ్ అంటే సివిల్, పర్సనల్, రిక్రూట్మెంట్, ఫైనాన్స్ డిపెండెంట్ విభాగాల్లో కనీసం నాలుగేళ్ల తర్వాత బదిలీ ఉంటుంది. మ్యూచువల్(పరస్పర) బదిలీకి మూడేళ్ల సర్వీస్ ఉన్నవారే అర్హులు. బదిలీ అయినచోట 10 ఏళ్లకు పైగా పనిచేసి ఉండవద్దు. ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా మైన్, డిపార్ట్మెంట్, ఏరియా, కార్పొరేట్ స్థాయిలో బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులపై ఆరోపణలు వచ్చే కార్మికులపై చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే మ్యాన్‌వల్‌గా దరఖాస్తు చేసుకున్న వారిని అవసరాల మేరకు బదిలీ చేస్తారు. ఇక భూగర్భ గని(అండర్ గ్రౌండ్) నుంచి ఓపెన్‌కాస్ట్(ఉపరితల) భూగర్భ గనిల్లోని సర్వేస్ జాబ్ కోసం బదిలీకి దరఖాస్తు చేసుకునే కార్మికుడు క్యాటగిరీ-1లోనే పనిచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం సింగరేణి వ్యాప్తంగా సీనియారిటీని పరిగణనలోకి తీసుకుంటారు. అంతేకాదు సర్వేస్‌లో జాబ్ కావాలంటే ఖాళీలను పరిగణనలోకి తీసుకుని సింగరేణి వ్యాప్తంగా ఎక్కడికైనా బదిలీ చేయవచ్చు. మెడికల్ గ్రౌండ్ ప్రకారం 10శాతం సర్వేస్ బదిలీలు కూడా ఉంటాయి. ఇంకా బదిలీ అయ్యాక మూడేళ్లు పూర్తయితేనే మళ్లీ బదిలీకి అవకాశం ఉంటుంది.

బదిలీ అవసరమైన కార్మికులకు అన్యాయమే

ఆవులు.. ఆవులు కొట్లాడి లేగ కాళ్లు విరగగొట్టిన చందంగా సింగరేణి నిర్ణయాలు ఉంటున్నాయి. పైరవీ బదిలీలకు అడ్డుకట్ట వేసేందుకు జారీ చేసిన సింగరేణి సర్యులర్‌పై కార్మికుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. చాలా గనుల్లో అనేక మంది కార్మికులు అనారోగ్యంతో బాధపడుతూ బదిలీ కోసం ఏండ్ల తరబడి ఎదురు చూస్తూ పని చేయాల్సిన పరిస్థితులు చాలా ఉన్నాయి. అయితే కార్మికులకు తమ సర్వీసులో రెండు సార్లు మాత్రమే బదిలీకి అవకాశం ఇవ్వడంతో అనారోగ్యం, గాయాలపాలై బదిలీ తప్పనిసరిగా అవసరమైన వారికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇంకా అనారోగ్యం, ఇతర కారణాలతో బావుల్లో పనిచేయలేని అర్హులైన వారికి సైతం సర్వేస్‌లో అవకాశం ఇవ్వకుండా సర్క్యులర్ జారీ చేయడంపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. వచ్చే నెల 1 నుంచే ఈ నిబంధనలు అమల్లోకి రాబోతున్నాయి. అయితే సింగరేణి యాజమాన్యం ఇలా ఏకపక్షంగా సర్క్యులర్ తెచ్చినా సింగరేణి గుర్తింపు సంఘం గానీ, ప్రాతినిధ్య సంఘం గానీ పట్టించుకోకపోవడంపై సింగరేణి వ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతున్నది.

రిజర్వేషన్లు అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలి

కోల్‌సిటీ, మే 24 : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని, దేశ వ్యాప్తంగా కుల గణన శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ మేలు కొలుపు యాత్ర శనివారం గోదావరిఖనికి చేరుకుంది. బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికే బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేలుకొలుపు రథయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు రమేశ్, ఉప్పరి శ్రీనివాస్, నవీన్, కోటేశ్వరరావు, వడ్డెపల్లి మనోహర్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా కూల్చివేతలు

- రామగుండంలో ఎలాంటి భద్రతా చర్యలు లేకుండానే మూడొంతస్తుల భవనం నేలమట్టం
- తెగిపడిన విద్యుత్ తీగలు, స్తంభాలు
- శిథిలాలు పడి ఎక్స్‌కవేటర్ ధ్వంసం
- మృత్యుంజయుడైన వాహన డ్రైవర్
- భయంతో పరుగులు తీసిన జనాలు

కోల్‌సిటీ, మే 24: రామగుండం నగర పాలక సంస్థ అధికారులు, అధికార పార్టీ నేతల కఠినత్వం మితిమీరుతుంది. అభివృద్ధి పేరుతో కూల్చివేతల పర్వం రానురానూ వివాదాలకు దారితీస్తుంది. వివరాల్లోకి వెళితే.. గోదావరిఖని మార్కండేయ కాలనీలో రోడ్ల అభివృద్ధి పేరుతో నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం మూడొంతస్థుల భవనంను కూల్చివేసేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, పోలీస్ పహారా మధ్య ప్రైవేటు ఎక్స్‌కవేటర్ వాహనంతో కూల్చివేయడం ప్రారంభించారు. సివిల్ కాంట్రాక్టర్‌కు చెందిన ఆ భవనాన్ని సదరు యజమాని ముందు రోజు రాత్రి నుంచే స్వచ్ఛందంగా తొలగిస్తున్నాడు. అయితే ఈ విషయం తెలుసుకొని కాంగ్రెస్ నాయకుల పురమాయింపుతో నగర పాలక అధికారులు ఎక్స్‌కవేటర్ వాహనాలతో అక్కడకు వచ్చి తామే కూల్చివేస్తామని రంగంలోకి దిగారు. అయితే ఎలాంటి రక్షణ గానీ, భద్రత గానీ లేదు. ఎక్స్‌కవేటర్ డ్రైవర్ ఒక్కో అంతస్తును కూల్చివేస్తుండగా అధికారులు జారుకున్నారు. అప్పటికే స్థానికులు తండోప తండాలుగా గుమిగూడారు. పోలీసులు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది అంతా ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ఇంతలోనే ఆ మూడంతస్థుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ప్రధాన రోడ్డుపై ఉన్న విద్యుత్ తీగెలు, స్తంభాలు ఆ శిథిలాల కింద నేలమట్టమయ్యాయి. అప్పటికే ఎక్స్‌కవేటర్ డ్రైవర్ ఆ శిథిలాల కింద చిక్కుకుపోయాడు. అదృష్టవశాత్తు వాహన మృత్యుంజయుడై గాయాలతో బయటకు వచ్చాడు. ఎక్స్‌కవేటర్ వాహనం శిథిలాల కింద ధ్వంసమైంది. ఇదిలా ఉండగా అంత పెద్ద భవనం కూల్చివేసే ముందు ఒక పద్ధతి, ప్రణాళిక, భద్రత లేకుండా రక్షణ చర్యలను ఆదమరిచి కూల్చివేతలకు ఒడిగట్టడం నగర పాలక అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం కుప్పకూలే సమయంలో శిథిలాలు ఎగిరి వచ్చి ప్రజల మీద పడి ప్రాణనష్టం జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించారు. కాగా, భారీ భవనం కూల్చివేత ఘటనలో ప్రాణనష్టం తప్పడం ఒకింత అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మార్కండేయ కాలనీలోని ప్రధాన రోడ్డుపై కుప్పకూలిన మూడంతస్తుల భవనం, విద్యుత్ స్తంభాలు.

రైల్వే అండర్ బ్రిడ్జిలు జలమయం

- ఒక్క భారీ వర్షానికే ప్రాంగణం చుట్టూ వరద
- నిలిచిపోయిన రాకపోకలు
- ఇబ్బందుల్లో వాహనదారులు

వర్షపు నీటితో నిండిన రైల్వే అండర్ బ్రిడ్జి

ఓదెల, మే 24: ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ పలుచోట్ల అండర్ బ్రిడ్జిలు నిర్మించింది. అయితే వాటి నిర్మాణాల్లో లోపాల కారణంగా వానకాలంలో వరద నీరు నిలుస్తున్నది. ఇందుకు నిదర్శనమే ఓదెల మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి. కాజీపేట-సిర్‌పూర్ కాగజ్‌నగర్ సెక్షన్ల మధ్యన మూడో లైన్ నిర్మాణం పూర్తికాగా.. ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రంలో అండర్ బ్రిడ్జి నిర్మించారు. అయితే శనివారం తెల్లవారుజామున కురిసిన ఒక్క భారీ వర్షానికే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది. మండల కేంద్రంతోపాటు ఉప్పరపల్లి, హరిపురం, కొత్తపల్లిలో అండర్ బ్రిడ్జిల నిర